క్లుప్తంగా

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



అభినవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

చెన్నేకొత్తపల్లి: కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎక్సైజ్ సీఐ చంద్రమణి సూచించారు. మేడాపురం గ్రామానికి చెందిన జోగన్నగారి అభినవ్ నీట్ పరీక్షలో 231 ర్యాంక్ సాధించడంతో ఆదివారం గాండ్ల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ.. సమాజంలో విద్య అత్యంత ప్రాధాన్యమైనదన్నారు. సమాజంలో మనిషి ఔన్నత్యాన్ని విలువలను పెంచుతుందన్నారు. సమాజానికి సేవ చేసే అవకాశం కల్పించేది విద్య మాత్రమే అన్నారు. అనంతరం శ్రీసత్యసాయి జిల్లా గాండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థి తల్లిదండ్రులు జోగన్నగారి ప్రభాకర్, సుజాత దంపతులతో పాటు అభినవ్‌ను ఘనంగా సన్మానించారు.

మానవత సంస్థ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణం



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సంస్థ చైర్మన్ తల్లం నారాయణమూర్తి, కేంద్ర కమిటీ చైర్మన్ కడప రామచంద్రారెడ్డి, డైరెక్టర్లు గోపి రామానుజులరెడ్డి, అనంతపురం సంస్థ చైర్మన్ శీలా జయరామప్ప హాజరయ్యారు. సంస్థ అధ్యక్షుడిగా జగ్గా వేణుగోపాల్, కార్యదర్శిగా కోనాపురం సాయిప్రసాద్, కోశాధికారిగా చల్లా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా మంజునాథ్, సంయుక్త కార్యదర్శిగా తాడిమర్రి రామకృష్ణయ్య, ఈసీ అవేర్‌నెస్ డైరెక్టర్‌గా గాజుల సోమేశ్వర్‌రెడ్డి, ఈసీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రాంప్రసాద్, ఈసీ హెల్త్ డైరెక్టర్ నారాయణమ్మ, ఎమర్జెన్సీ డైరెక్టర్ గోనుగుంట్ల ఆంజనేయచౌదరి ప్రమాణస్వీకారం చేశారు. సమాజ సేవలో ఎల్లప్పుడు ముందుంటామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

కాపర్ వైరు అపహరణ

కదిరి అర్బన్: పట్నం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. విషయం తెలుసుకున్న విద్యుత్ ఏఈ శ్రీనివాసులునాయక్ ఆదివారం రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీని విలువ రూ. 20 వేలు చేస్తుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

రిటైర్డ్ పోస్టుమాస్టర్‌కు సన్మానం

కదిరి టౌన్: చౌక్ తపాలా కార్యాలయంలో పని చేస్తూ గత నెల 30న ఉద్యోగ విరమణ చేసిన పోస్టు మాస్టర్ పి.మహేష్‌బాబు దంపతులను పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ తపాలా ఉద్యోగులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు మహేష్‌బాబు సేవలను కొనియాడారు. పోస్టు మాస్టర్లు భాస్కర్‌రెడ్డి, నరసింహమూర్తి, చైతన్యరెడ్డి, రామమోహన్, ఈశ్వరయ్య, వెంకటనారాయణ, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శిగా చెలిమి రామయ్య



ధర్మవరం రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ధర్మవరం మండలం గరుడంపల్లికి చెందిన చెలిమి రామయ్యను వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. తన నియామకానికి కృషి చేసిన మాజీ మంత్రి శంకరనారాయణ, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి రామయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

ధర్మవరం రూరల్: పట్టణంలో లూడో గేమ్, బారకట్ట ఆడుతూ జూదం వేస్తున్న 13 మందిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.2,650 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కృష్ణాజలాలు అందించాలి

గాండ్లపెంట: కదిరి ప్రాంతానికి హంద్రీ–నీవా ద్వారా కృష్ణాజలాలు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ డిమాండ్ చేశారు. రెక్కమాను గ్రామంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీరాములునాయుడు అధ్యతన ఆదివారం గాండ్లపెంట, ఎన్పీకుంట మండలాల మహాసభ జరిగింది. ఈసందర్భంగా వేమయ్య యాదవ్ మాట్లాడుతూ కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా వలసలు ఆపాలంటే హంద్రీనీవా అందించాలన్నారు. కదిరి డివిజన్ కార్యదర్శి పవన్, వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప, డివిజన్ సహాయ కార్యదర్శి హస్సన్, రమణ, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి మధునాయక్, పట్టణ కార్యదర్శి లియాఖత్‌అలీ, మహిళా కార్యదర్శి ఆదిలక్ష్మి, సూర్యనారాయణ, ఆదెప్ప, మనోహన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో కక్షలకు ఆజ్యం

- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు గ్రామాల్లో కక్షలకు ఆజ్యం పోస్తున్నారని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధిని మరచి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేయించడంతోపాటు అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఈక్రమంలో కొత్తచెరువులో 14 మంది వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసు నమోదు చేయించారన్నారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా ఆస్తుల ధ్వంసం చేయటంతో పాటు రైతులు ఎంతో కష్ట పడి సాగు చేసుకున్న మామిడి, చీనీ చెట్లను టీడీపీ మద్దతురు దారులు తెగ నరుకుతున్నారన్నారు. వాటిని మాజీ మంత్రి నివారించాలని హితవుపలికారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి స్వతంత్రంగా వ్యవహరించాలన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి చంద్రబాబు మోసాలను ప్రజల్లో ఎండగడతామన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, పుట్టపర్తి, పుట్టపర్తి రూరల్, బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు మండలాల కన్వీనర్లు రవి నాయక్, ఈశ్వరయ్య, కొత్తకోట కేశప్ప, శ్యామ్ సుందర్‌రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, జయప్ప, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, శేషూరెడ్డి, ఎంపీపీలు రమణారెడ్డి, గాయత్రి రెడ్డెప్పరెడ్డి, సునిత, జెడ్పీటీసీలు లక్ష్మీ నరసమ్మ, శ్రీలత గోవర్ధన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, కవిత శివశంకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్లు గంగాద్రి నరసారెడ్డి, సూర్యనారాయణ, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు పొరకల రమణ, కుండ్ల కిష్టయ్య, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌హెచ్ బాషా, సంయుక్త కార్యదర్శులు మున్వర్ బాషా, నిస్సార్ అహమ్మద్, మహిళా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భారతి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రంగారెడ్డి, వాణిజ్య విభాగం కార్యదర్శులు నర్సిరెడ్డి, చెరువు భాస్కర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి లక్ష్మీపతిరెడ్డి, గ్రీవెన్సు విభాగం కార్యదర్శి వెంకట రంగారెడ్డి, వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి మిద్దె భాస్కర్‌రెడ్డి, సేవాదళ్ కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఫొటో సాయి, పార్టీ ఉపాధ్యక్షుడు సిద్దరాంపురం కేశప్ప, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మల్లికార్జున, ఐటీ వింగ్ అధ్యక్షుడు గంగిరెడ్డి, డాక్టర్ల విభాగం అధ్యక్షుడు రమేష్, ఆక్టివ్ కార్యదర్శి రఘురామయ్య, ఆర్గనైజ్ కార్యదర్శులు మధుసూదన్ నాయకుడు, మహబూబ్, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, మహిళా అధ్యక్షురాలు కొండసాని కన్యాకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు పొరకల రామాంజనేయులు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సుభక్తుల్లా, విద్యార్థి విభాగం అధ్యక్షుడు భాను ప్రకాశ్‌రెడ్డి, మున్సిపల్ విభాగం అధ్యక్షురాలు సాయి గీత, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు శివ శంకర్ రెడ్డి, వలంటీర్ విభాగం అధ్యక్షుడు నరేశ్ కుమార్ యాదవ్, గ్రీవెన్సు విభాగం అధ్యక్షుడు విజయారెడ్డి, సాంస్కృతిక అధ్యక్షుడు రమేష్, సోషల్ మీడియా అధ్యక్షుడు ఇర్ఫాన్, ఐటీ విభాగం అధ్యక్షుడు కొండారెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు రామమోహన్, ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నిలువునా మోసం



చంద్రబాబు గతంలో రైతు రుణ మాఫీ చేస్తామని మోసం చేశాడు. 2024లో ఒకే దఫా రూ.20 వేలు అన్నదాతసుఖీభవ కింద రైతులకు అందిస్తామన్నారు. ఏడాది కాలం గడచినా అమలు చేయలేదు. రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పి నిరుద్యోగులకు టోపీ పెట్టారు. ఉచిత బస్సు పథకం ఎగ్గొట్టారు.

–ఆవుటాల రమణారెడ్డి జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్

మహిళలకు బాబు కుచ్చు టోపీ



చంద్రబాబునాయుడు ఏడాది పాలనలో మహిళలకు కుచ్చుటోపీ పెట్టారు. తల్లికి వందనం పథకం అమలులో వంచనే. గ్యాస్ సిలిండర్లు ఏడాది గడచినా ఒక్కటి ఇచ్చి మోసం చేశారు. ఉచిత బస్సు అమలుకు పంగనామాలు పెట్టారు. ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 హామీ నెరవేర్చలేదు.

–సాయిలీల, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి

సాయం గోరంత.. ప్రచారం కొండంత



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.లక్షల కోట్లు పేదలకు అందించిన ఘనత ఉంది. టీడీపీ ప్రభుత్వం గోరంత సాయం చేస్తే కొండంత ప్రచారం నిర్వహిస్తోంది. చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తాం.

–శ్రీధర్‌రెడ్డి, ఎంపీపీ బుక్కపట్నం

బాబును దోషిగా నిలబెట్టాలి



సూపర్‌సిక్స్ మోసాలను ప్రజలకు వివరించి చంద్రబాబును వారి ముందు దోషిగా నిలపట్టాలి. ప్రతి ఒక్క కార్యకర్త బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ పేరుతో ఇంటింటికి వెళ్లి మోసాలను ఎండగట్టాలి. ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత నాయకులందరిపై ఉంది.

–రమేష్‌నాయక్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

బాబు మోసాలను ప్రజలకు వివరిస్తాం



చంద్రబాబు ఏడాది పాలనలో దళితులకు జరిగిన అన్యాయం, వారిపై జరిగిన దాడులపై గ్రామాల్లో పర్యటించి వివరిస్తా. ఎన్నికల ప్రచారంలో 50 ఏళ్లు నిండిన బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలకు పింఛన్ ఇస్తామని కూటమి నాయకులు భారీగా ప్రచారం చేశారు. అయితే ఇంతవరకూ ఆ ఊసే ఎత్తడం లేదు.

–గంగిశెట్టి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు



ఓబుళేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బత్తలపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆదివారం మండల కేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వర ఆలయంతోపాటు పలు గ్రామాల్లోని ఆలయాలు, రైతుల ఇళ్లల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు పొలాల్లో వినియోగించే పరికరాలను, గడ్డికి పూజలు చేపట్టారు. పిండి పదార్థాలను నైవేద్యంగా ఉంచి నారికేళాలను సమర్పించారు.

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం తొలి ఏకాదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుర్లపల్లి గ్రామ సమీపంలోని వారాదయ్య కొండపై వెలసిన ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కాలినడకన కొండపైకి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఇక మండలంలోని తగరకుంట గ్రామంలో గులగాన కొండపై వెలసి వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.

ముదిగుబ్బ: మండలకేంద్రంలోని గణేశ హరిహర ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణం చేపట్టారు.

చెన్నేకొత్తపల్లి: తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. చెన్నేకొత్తపల్లిలోని ఓబుళ లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి మూల విరాట్‌ను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి ప్రతిమను మండల కేంద్రం నుంచి న్యామద్దెల గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న కొండకు తీసుకెళ్లారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని అన్ని ప్రముఖ ఆలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంతోపాటు కొత్తపేట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఓబుళేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పుట్టపర్తి అర్బన్: జగరాజుపల్లి సమీపంలో ఎత్తయిన కొండపై వెలసిన ఓబుళేశ్వరస్వామి కొండపై తొలి ఏకాదశి ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆరుబయట వెలసిన స్వామికి పంచలోహ కవచం అలంకరించి పూజలు చేపట్టారు. పూజల అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, సభ్యులు సూర్యనారాయణరెడ్డి, ఉమాపతి, రంగారెడ్డి, రామచంద్రారెడ్డి, శంకర్, జయరామిరెడ్డి, చెన్నయ్య, ఓబుల్‌రెడ్డి, శంకరప్ప తదితరులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంధత్వ నిర్మూలనే లయన్స్‌క్లబ్ లక్ష్యం



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా లయన్స్ క్లబ్ పనిచేస్తోందని క్లబ్ ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్, పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ గోపా నరసింహులు తెలిపారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం లయన్స్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు ప్రమాణం చేశారు. గోపా నరసింహులు, మాజీ గవర్నర్ రమేష్‌నాథ్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు, కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు వెంకటస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఆకులేటి రమేష్‌బాబు, కార్యదర్శిగా ఉలవల నాగేంద్ర, కోశాధికారిగా కొత్తపాళ్యం వెంకటేష్ కుమార్, ఉపాధ్యక్షులుగా జగదీశ్వరప్రసాద్, పుట్లూరు నరసింహులు, శాగా సురేష్, క్లబ్ సర్వీస్ చైర్మన్‌గా కొత్త శ్రీరాములు, మెంబర్‌షిప్ చైర్మన్‌గా ఉట్టి శివప్రసాద్, అడ్మినిస్ట్రేటర్‌గా రాధాకృష్ణ, డైరెక్టర్లుగా పల్లెం వేణుగోపాల్, గూడురు మోహన్‌దాస్, వెంకటస్వామి, గోసే రాధాకృష్ణ, మెటికల కుళ్లాయప్ప, ఇంటూరి నారాయణరెడ్డి, గూడూరు రాజగోపాల్, బి.వి.శ్రీనివాసులు, బండి వేణుగోపాల్, గంజికుంట శ్రీధర్‌బాబు, రాజీవ్‌నేత, ఎం.క్రిష్ణ, చందా నాగరాజు, వేణుగోపాలాచార్యులను ప్రమాణ స్వీకారం చేశారు.

సంక్షిప్త సమాచారం

గ్రామీణాభివృద్ధి దినోత్సవం

ముదిగుబ్బ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. తహసీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీఓ దివాకర్, ఎంఈఓ రమణప్ప పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు నేత్రజ్యోతి కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వర్ష 78 మందికి కంటి పరీక్షలు చేయగా 48 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికైనట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్ తెలిపారు. పూజారి లక్ష్మీదేవి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పూజారి జగదీష్ సహకారంతో శిబిరం నిర్వహించామన్నారు. యువర్స్ ఫౌండేషన్ పీఆర్‌ఓ రాధాకృష్ణ, క్యాంపు చైర్మన్ చాంద్‌బాషా, సభ్యులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయానికి విరాళం

ధర్మవరం అర్బన్: లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో అన్నప్రసాద శాల ఫ్లోరింగ్‌కు రైస్ మిల్ అధినేత గంగిరెడ్డి దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందించారు.

కనుల పండువగా పీర్ల గ్రామోత్సవం



నల్లమాడ మండలం గోపేపల్లిలో గుండం చుట్టూ అలావు తొక్కుతున్న యువకులు



గ్రామోత్సవంలో వెంకటగారిపల్లి, అనంతసాగరం, లింగారెడ్డిపల్లి పీర్లు

బత్తలపల్లి: మాల్యవంతం, సంజీవపురం, ఈదుల ముష్టూరు పంచాయతీల్లో ఆదివారం ఖాశీంస్వామి పీర్ల గ్రామోత్సవం కనులపండువగా సాగింది. మాల్యవంతం పీర్లకు ఎం.చెర్లోపల్లి, చీమలనాగేపల్లిలో గ్రామోత్సవం నిర్వహించారు. సంజీవపురం పీర్లు ఈదుల ముష్టూరుకు వెళ్లి అక్కడ పీర్లతో భేటీ తీసుకున్నాయి. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. లింగారెడ్డిపల్లి వద్ద వెంకటగారిపల్లి పీర్లను లింగారెడ్డిపల్లి, అనంతసాగరం గ్రామాల పీర్లు భేటీ తీసుకున్నాయి. అక్కడ నుంచి పీర్లన్నీ లింగారెడ్డిపల్లిలో గ్రామోత్సవం అనంతరం అక్కడ నుంచి అనంతసాగరం చేరుకున్నాయి. పీర్ల వెంట వందలాది మంది భక్తులు తరలివెళ్లారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చక్కెర చదివించారు. ఈ సందర్భంగా జలధి రోజు మంగళవారం వెంకటగారిపల్లి సత్రం వద్ద జరిగే భేటీలకు రమ్మని ఆయా గ్రామాలకు చెందిన ఖాశీంస్వాములను మాల్యవంతం, వెంకటగారిపల్లి పీర్లు ఆహ్వానిస్తాయని ముజావర్లు తెలిపారు. ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్, ఏఎస్ఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామాల్లో బందోబస్తును పర్యవేక్షించారు.

నేడు పెద్ద సరిగెత్తు.

మొహర్రంలో భాగంగా మాల్యవంతం, సంజీవపురం, ఈదుల ముష్టూరులో సోమవారం పెద్ద సరిగెత్తు నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు. మంగళవారం వెంకటగారిపల్లి సత్రం వద్ద భేటీ తీసుకుంటాయన్నారు. అదే రోజుసాయంత్రం జలధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోండి

మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ సూచించారు. ఆదివారం రాత్రి బత్తలపల్లితోపాటు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి గ్రామపెద్దలకు పలు సూచనలు, సలహాలు అందించారు. సోమవారం, మంగళవారం జరిగే పెద్ద సరిగెత్తు, జలధి సందర్భంగా గ్రామాలలో మద్యం అమ్మకాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తనకల్లు: మండల కేంద్రంతో పాటు దుగినేపల్లి, ఉస్తినిపల్లి, కోటూరు, కుంటమరవ గ్రామాల్లో ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో మొహర్రంను జరుపుకున్నారు. అనవాయితీలో భాగంగా మొహర్రం చివరి రోజున స్థానిక బైరాగి గుట్ట వద్ద ఆయా గ్రామాలకు చెందిన పీర్లు భేటీ అయ్యాయి. కార్యక్రమాన్ని తిలకించడానికి పెద్ద ఎత్తున భక్తాదులు విచ్చేశారు. స్వాముల వారికి చదివింపులు చదించి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మకాన్‌ల వద్ద ఏర్పాటు చేసి అగ్నిగుండం చుట్టూ యువకులు నృత్యాలు చేశారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు

కనగానపల్లి: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలు గ్రామాల్లో పెద్ద సరిగెత్తు కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం కనగానపల్లిలో జరుగుతున్న దస్తరిగి, వన్నూరు స్వామి ఉత్సవాల్లో భాగంగా పీర్ల స్వాములను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. భక్తులు పీర్లస్వాములకు చెక్కర, గంధం చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఇక పీర్ల చావిడి ముందు అగ్నిగుండాలు వెలగించి పిల్లలు, పెద్దలు వాటి చుట్టూ తిరుగుతూ ఉత్సాహంగా అలావు తొక్కారు. సోమవారం చివరి రోజు పీర్ల స్వాములను అగ్నిగుండ ప్రవేశం చేయించి జలధి కార్యక్రమం నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

తాడిమర్రి: స్థానిక పీర్ల చావిడిలో ఆదివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తును జరుపుకున్నారు. మొహర్రం వేడుకల్లో భాగంగా కుళ్లాయస్వామి, దడుంపీరు, చిన్న ఖాశీం, పెద్ద ఖాశీం తదితర పీర్లను నిలబెట్టారు. ఈ సందర్భంగా ముల్లాసాబ్ ముత్తుజా పీర్లకు నూతన వస్త్రాలు ధరింపజేసి, వెండి గొడుగులను తొడిగి, వివిధ రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. ఫకీర్లు అయిన వారు మేళాలు, డప్పుల వాయిద్యాలతో ఊరేగింపుగా చెక్కెర, బెల్లం, పానకాలను తీసుకుని వచ్చి స్వాములకు సమర్పించారు.

నల్లమాడ: పులగంపల్లి, గోపేపల్లిలో ఆదివారం పీర్లను జలధికి తరలించారు. అంతకుమునుపు శనివారం రాత్రి ఆయా గ్రామాల్లో పెద్ద సరిగెత్తు నిర్వహించి ఆరోజు రాత్రి పీర్ల స్వాములను గ్రామాల్లో ఊరేగించారు. ఆదివారం తెల్లవారుజామునే గుండం వద్ద పొట్టేళ్లు, కోళ్లను బలిచ్చారు. సాయంత్రం గుండం చుట్టూ యువకులు తప్పెట దరువులకు అనుగుణంగా ఎంతో ఉత్సాహంగా అలావు తొక్కారు. అనంతరం పీర్లను అగ్ని గుండ ప్రవేశం చేయించి జలధికి తరలించారు.



వెంకటగారిపల్లిలో అలావ్ తొక్కుతున్న గ్రామస్తులు



తనకల్లులోని బైరాగి గుట్ట వద్ద భేటీ అయిన పీర్లు



కనగానపల్లిలో పీర్లచావిడి ముందు వేసిన అగ్ని గుండం

వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా అమర్‌నాథ్‌రెడ్డి



ధర్మవరం వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ధర్మవరానికి చెందిన వేముల అమర్‌నాథ్‌రెడ్డి నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి అమర్‌నాథ్‌రెడ్డి ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేతిరెడ్డికాలనీలో వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలు.. కేతిరెడ్డికాలనీకి చెందిన కొడిగ రామాంజినేయులు ఆరేళ్ల క్రితం పెద్ద కుమారుడు రవీంద్రకు రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి చెందిన లక్ష్మీతేజతో వివాహం చేశారు. కొన్నేళ్ల నుంచి వారి మధ్య మనస్పర్ధలతో గొడవపడుతుంటే పెద్దమనుషుల సమక్షంలో సర్దిచెప్పారు. ఆదివారం కోడలు లక్ష్మీతేజ మేనమామలైన నాగభూషణం, మునిస్వామి ఇంటి వద్దకు వచ్చారు. ఈక్రమంలో వారు తమ మేనకోడలును సరిగ్గా చూసుకోరా అంటూ నానా దుర్భాషలాడుతూ ఇటుకలతో రామాంజనేయులుపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

సమస్యలు తీర్చేదాకా రిలే దీక్షలు విరమించం

ధర్మవరం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు తీర్చేదాకా రిలే దీక్షలు విరమించమని సంఘం నాయకుడు బొగ్గు నాగరాజు తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ముందు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 11వరోజూ కొనసాగాయి. ఈ సందర్భంగా బొగ్గు నాగరాజు, బాబు, అనిల్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో వాటర్ వర్క్స్, పార్క్ స్ట్రీట్ లైట్, కంప్యూటర్ ఆపరేటర్స్‌కు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, జీఓ 36 ప్రకారం రూ.24500 వేతనం అమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే 12 నుంచి సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. సంఘం నాయకులు యోగేష్, రాంప్రసాద్, దస్తగిరి, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఆర్డీటీ ఆసుపత్రిలో ఏకలవ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ సోమశేఖర్, ఏపీ ఎరుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎబిలి శ్రీరాములు, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీకాంతమ్మ మాట్లాడుతూ ద్వాపరయుగ చరిత్రలో నిలిచిపోయిన ధీరుడు ఏకలవ్యుడన్నారు. అనంతరం వారు అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎరుకుల సంఘం నాయకులు సాకే వెంకట్రామయ్య, సాకే గోవిందు, పెనుకొండ చంద్రయ్య, పామిడి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తలుపుల : ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో మృతి చెందాడు. వివరాలు.. దాంపల్లికి చెందిన రమణ (57) కొంత కాలంగా ఛాతీనొప్పితో బాధపడుతున్నాడు. రెండు రోజులుగా నొప్పి తీవ్రం కావడంతో తాళలేక శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురం తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య గంగాదేవి, ఇద్దరు కుమార్తెలున్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

అక్కమ్మ దేవతల పరుష

ధర్మవరం అర్బన్: గుట్టకిందపల్లిలో ఆదివారం అక్కమ్మ దేవతల పరుష ఘనంగా నిర్వహించారు. పూజారి గుంజర మహేష్, బయన్న ఆధ్వర్యంలో అక్కమ్మ దేవతలకు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.